క్లుప్తంగా

వేడుకగా సాయినాథుని 16వ వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో సాయిబాబా

కార్వేటినగరం: సాయి బాలాజీ నగర్‌లో వెలసిన షిరిడీ సాయినాథుని ఆలయంలో 16వ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. స్వామివారిని పట్టు వస్త్ర సుగంధ భరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ప్రత్యేక హోమాలు నిర్వహించారు. బెంగళూరుకు చెందిన వైఎస్.మాధవరాజు వెయ్యిమందికి అన్నదానం చేశారు.

దోమతెర తప్పక వాడాలి



బాలికల బీసీ హాస్టల్‌లో కిటికీల మెస్‌ను పరిశీలిస్తున్న మోహన్‌బాబు

పాలసముద్రం: ప్రభుత్వ వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థులు రాత్రుల్లో దోమతెర తప్పకుండా ఉండాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి మోహన్‌బాబు తెలిపారు. సోమవారం ప్రభుత్వ బీసీ బాలికల, బాలుర వసతి గృహాలను ఆయన తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సీజన్‌లో దోమల వల్ల అంటువ్యాధులు వచ్చే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. కిటికీలకు మెస్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

విబూది అలంకరణలో కాలభైరవ స్వామి



ప్రత్యేక అలంకరణలో కాలభైరవ స్వామి

నగరి : ఆడి అష్టమిని పురస్కరించుకొని పట్టణ పరిధిలోని కామాక్షి సమేత కరకంఠేశ్వర ఆలయంలోని కాలభైరవ స్వామి సన్నిధిలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి పాలు, పెరుగు, చందనం, పంచామృతం, పన్నీరు, విబూదితో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అభిషేకానంతరము స్వామివారికి అభిషేకం చేసి విబూది అలంకరణ చేశారు. భక్తులు సమర్పించిన వడమాలలతో ప్రత్యేక అలంకరించారు. పూజల అనంతరం విచ్చేసిన భక్తులందరికీ విబూది ప్రసాదాలు అందజేశారు.

భక్తి శ్రద్ధలతో కాలభైరవ అష్టమి యజ్ఞం



యజ్ఞపూజ చేస్తున్న అర్చకులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరం రాములుగుడివీధిలోని శ్రీ అగస్తీశ్వర స్వామి ఆలయంలో సోమవారం కాలభైరవ ట్రస్టు ఆధ్వర్యంలో శ్రీ మహా కాలభైరవ అష్టమి యజ్ఞ మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో జరిపించారు. ఉదయం అగస్తీశ్వరస్వామికి మహాభిషేకం, విఘ్నేశ్వరపూజ, గోపూజ, అశ్వపూజ, శునక పూజ, 108 శంఖు, 81 కలశ స్థాపన మొదటిపూజ, దీపారాధన సాయంత్రం, కాళభైరవ స్వామికి 64 ద్రవ్యాలతో అభిషేకం, యజ్ఞ పూజలను వేద మంత్రోచ్ఛరణలతో జరిపించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ వెంకటేష్, అర్చకులు శివ, ఈవో తిమ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు నూతన భవనం ప్రారంభం

యాదమరి(పూతలపట్టు): యాదమరి మండలం సంతగేటులోని నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ప్రారంభోత్సవం నిర్వహించనున్నట్లు వైద్యాధికారులు సురేఖ, అనిల్‌కుమార్ నాయక్ ఓ ప్రకటనలో తెలిపారు. నూతనంగా నిర్మించిన ఆరోగ్య కేంద్ర భవనాన్ని ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. దీనికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ శాఖామాత్యులు సత్యకుమార్ యాదవ్ హాజరుకానున్నట్లు వివరించారు. ఈ నెల 28వ తేదీ ఉదయం 9.30 గంటలకు నిర్వహించనున్నట్లు తెలిపారు.

డ్వాక్రా బజార్ ప్రారంభం

తిరుపతి కల్చరల్: డ్వాక్రా మహిళా సంఘాల ఆధర్యంలో నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన డ్వాక్రా బజార్‌ను సోమవారం ప్రారంభించారు. ఈ బజార్‌లో వివిధ రాష్ట్రాలకు చెందిన డ్వాక్రా మహిళలు స్వయంగా తయారు చేసిన ఉత్పత్తులను స్టాల్స్ ద్వారా ఏర్పాటు చేశారు. మహిళలు మెచ్చే అన్ని రకాల గృహోపలంకరణలు, వస్త్రాలు, ఆట బొమ్మలు, చేతి వృత్తుల ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయి. అంతేకాక పిల్లలకు ఆహ్లాదకరమైన వాతావరణం అందించేందుకు జాయింట్ వీల్, బ్రేక్ డ్యాన్స్ వంటివి ఏర్పాటు చేశారు.

భద్రత చట్టాలు పటిష్టం చేయాలి



ప్రభుత్వ ఆస్పత్రుల్లో భద్రత చట్టాలు మరింత పటిష్టం చేయాలి. విధులు నిర్వర్తించే ఇతర అధికారులపై చేయిచేసుకోవడం ఎంత నేరమో అలాగే విధినిర్వహణలో ఉన్న వైద్యులపై దాడిచేయడం, అమర్యాదగా మాట్లాడడం చేసేవారిని కఠినంగా శిక్షించాలి. భద్రత కోసం ప్రత్యేకంగా చట్టాలు తీసుకురావాలి. వైద్యులంటే ప్రాణరక్షకులన్న గౌరవంతో పాటు వారి జోలికి వెళితే చట్టాలు వదలవు అన్న భయం రావాలి.

– డాక్టర్ జరీనా, గైనకాలజిస్ట్, నగరి ఏరియా ఆస్పత్రి



మహిళా కానిస్టేబుల్‌ను నియమించాలి



మారుమూల ప్రాంతం పీహెచ్‌సీలకు రాత్రి పూట ఓ మహిళా కానిస్టేబుల్‌ను నియమిస్తే భద్రత ఉంటుంది. రూరల్ మండలంలో రాత్రి పూట వచ్చే రోగులతోపాటు సహాయకులు మద్యం మత్తులో వస్తుంటారు. వారి వల్ల రోగులకు వైద్య అందించడం ఇబ్బంది ఉంటుంది. వారిని హెచ్చరించినా తిరగబడే పరిస్థితి ఉంటుంది. అలాటప్పుడు ఓ మహిళ కానిస్టేబుల్‌ను ఏర్పాటు చేస్తే డాక్టర్లకు ధైర్యంగా ఉంటుంది.

– డాక్టర్ సోమశేఖర్

ప్రాణాలు తీస్తున్న తీగలు

- విద్యుత్ శాఖ నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనం
- విద్యుత్ స్తంభాలు ఎక్కని ఎల్ఎం, జేఎల్ఎం లు
- టీ కొట్లలో కబుర్లలో మునిగిన అధికారులు





పన్నూరు సబ్‌స్టేషన్ (ఇన్‌సెట్‌లో) మృతి చెందిన వాసు (ఫైల్)

విజయపురం : విద్యుత్ శాఖ అధికారులు అంత కరుడుకట్టి పోయారా? సామాన్యుల ప్రాణాలంటే వారికి అసలు లెక్క లేకుండా పోయాయి. వారి నిర్లక్ష్యం అమాయకుల ప్రాణాలు తీస్తున్నా ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు? ఇటీవల విద్యుత్ శాఖ సిబ్బంది కారణంగా కష్టజీవుల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. వీటిని చూసిన వాళ్లందరిలో ఇవే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. విజయపురం మండలం ట్రాన్స్‌కో సిబ్బంది నిర్లక్ష్యం పని చేస్తున్నారని, దీన్ని ఫలితంగా కొందరు విద్యుత్ షాక్‌కు గురైతే మరి కొంత ప్రాణాలు పోగొట్టుకొంటున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. మండలంలోని విద్యుత్ శాఖలో కాంట్రాక్టర్ పద్ధతిలో పని చేస్తున్న చిరుద్యోగుల ప్రాణాలు గాలిలో కలిసిపోవడం చూస్తే మనుషుల ప్రాణాలంటే అధికారులకు ఎంత చులకనో కళ్లకు కట్టినట్లు అర్థం అవుతోంది. పైగా యువకుడి ప్రాణం పోయిన తరువాత కూడా ఆ విషయమై వారు స్పందించిన తీరు మానవత్వం పైనే నమ్మకాన్ని కోల్పోయేలా చేస్తోంది. వ్యవస్థలో పేరుకుపోతున్న నిర్లక్ష్యంతో సామాన్యులు ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి.

పన్నూరులో తరచూ ప్రమాదం

విజయపురం మండలం పన్నూరు సబ్‌స్టేషన్‌లో అధికారుల నిర్లక్ష్యంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. మూడు రోజుల క్రితం ట్రాన్స్‌కోలో దినసరి కూలీగా పనిచేస్తున్న వాసు (32) పన్నూరు సమీపంలో పొలంలో విద్యుత్ స్తంభంపైకి ఎక్కి మరమ్మతులు చేస్తుండగా, ఒక్కసారిగా తీగల్లో కరెంటు సరఫరా కావడంతో హై ఓల్టేజ్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. రెండేళ్ల క్రితం అదే పన్నూరు సబ్‌స్టేషన్‌లో ఓ యువకుడు విద్యుత్ స్తంభం ఎక్కి మరమ్మతులు చేస్తుండగా ఒక్క సారిగా తీగల్లో కరెంటు సరఫరా కావడంతో హై ఓల్టేజ్ షాక్‌కు గురయ్యాడు. అయితే అదృష్టవశాత్తు గాయాలతో బయటపడ్డాడు. ఈ విషయం ఎవరికీ తెలియకుండా అధికారులు గోప్యంగా ఉంచారు.

విద్యుత్ స్తంభం ఎక్కని ఎల్ఎం, జేఎల్ఎం

విద్యుత్ శాఖలో నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనం. నిజానికి ఈ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు, పొలాల్లో ఫీజుల మరమ్మతుల పని లైన్‌మన్ లేదా జూనియర్ లైన్‌మెన్ చేయాలి. ఆ పనులను సబ్‌స్టేషన్ నుంచి ఒక అధికారి పర్యవేక్షించాలి. కానీ విద్యుత్‌శాఖ అధికారులు వీటిలో ఏ ఒక్క నిబంధనా పాటించలేదు. దీంతో అమాయక యువకులు బలవుతున్నారు.

టీ కొట్టు, దుకాణాల్లో కబుర్లు

విద్యుత్‌శాఖలో పని చేస్తున్న చాలా మంది ఎల్ఎం, జేఎల్ఎంలు సరిగా విధులకు కావడం లేదని, ఒక వేళ వచ్చినా రిజిస్టర్ బుక్‌లో సంతకం పెట్టి టీ కొట్టు, దుకాణాల వద్ద కూర్చొని కాలయాపన చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఎక్కడైనా సమస్యలు తలెత్తితే వెంటనే ఫోన్ ద్వారా ఎస్‌సీ తీసుకొని ఫీల్డ్ అసిస్టెంట్, హెల్పర్ చేత మరమ్మతులు చేయిస్తున్నారు. ఇలాంటి సమయంలో ప్రమాదాలు జరిగి యువకులు ప్రాణాలు పోగొట్టుకొంటున్నారు.

ఉన్నతాధికారులు దృష్టి సారించాలి

ఇలాంటి సంఘటనలపై ఉన్నతాధికారులు దృష్టి పెట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. విద్యుత్ శాఖలో పని చేస్తున్న సిబ్బంది పని తీరుపై పర్యవేక్షించాలి, పని చేయని వారిపై కఠిన చర్యలు తీసుకుంటే తప్ప, ఇలాంటి సంఘటన మరోసారి పునరావృతం కాకుండా ఉంటుందని ప్రజలు అంటున్నారు.

కొండమల్లీశునికి కుంకుమాభిషేకం



ప్రత్యేక అలంకరణలో స్వామి వారు

వెదురుకుప్పం: మండలంలోని డీఆర్ఎన్ కండ్రిగ సమీపంలో అరుణగిరిపై ఉన్న జ్ఞాన ప్రసూ నాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో సోమవారం ఘనంగా పూజలు నిర్వహించారు. వేకువ జామునే సుప్రభాత సేవతో స్వామి వారిని మేల్కొలిపి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. కొండ మల్లీశునికి పాలు, పెరుగు, కుంకుమతో అభిషేకం చేశారు. ఆలయ ఆవరణలో ఉన్న పంచముఖ ఆంజనేయ స్వామికి పూజలు చేశారు. చవటగుంటలో ఉన్న మీనాక్షి సమేత ఆవుదేవర నందీశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు.

చిరువ్యాపారుల నిరసన

తిరుపతి(అలిపిరి): స్థానిక టీటీడీ పరిపాలనా భవనం ఎదుట శ్రీవారి మెట్టు మార్గంలోని చిరు వ్యాపారులు చేస్తున్న నిరసన దీక్ష 6వ రోజుకు చేరుకుంది. సోమవారం చిరువ్యాపారుల పిల్లలచే శ్రీకృష్ణాష్టమి సందర్భంగా వేషధారణలు చేయించి నిరసన తెలిపారు.

ఆక్రమణలో ఒరవ కాలువ



కాలువ ఇరుపక్కలా పెరిగిన చెట్లు, పిచ్చిమొక్కలు

విజయపురం : మండలంలోని మిట్టూరు ఒరవ కాలువ ఆక్రమణకు గురైందని స్థానిక ప్రజలు, రైతులు వాపోయారు. కోసలనగరం కొండ నుంచి మిట్టూరు, ఇల్లత్తూరు వరకు వచ్చే కాలువ విస్తీర్ణం సుమారు 8.20 సెంట్లు. దీన్ని వెడల్పు సుమారు 10 అడుగులు. కానీ కాలక్రమేణ కాలువ కుదించుకునిపోయింది. దీంతో వర్షాకాలంలో కొండ నుంచి జారే వర్షపు నీరు చెరువులోకి చేరడం లేదని రైతులు వాపోయారు. అధికారులకు ఎన్ని సార్లు చెప్పినా పట్టించుకోలేదన్నారు.

బీడుబారిన భూములు

మిట్టూరు, ఇల్లత్తూరు చెరువు కింద సుమారు 300 ఎకరాల సాగు భూమి ఉంది. వర్షాలు పడి చెరువు నిండినప్పుడే సాగు చేస్తారు. అయితే ప్రతి ఏటా వర్షాలు పడిన చెరువు నిండడంగా కష్టంగా మారింది. కాలువ పూర్తిగా ఆక్రమణకు గురికావడంతో వర్షపు నీరు రావటం లేదు. దీంతో ప్రతి ఏటా సుమారు 300 ఎకరాలు బీళ్లుగా ఉన్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాగునీరు లేక రైతులు కూలి పనికి వెళుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అక్రమార్కులపై పోలీసుల ఉక్కుపాదం

- ఎస్పీ ఆదేశాలతో పంజా విసురుతున్న స్పెషల్ బ్రాంచ్
- వారంలో నాలుగు ముఖ్యమైన దాడులు
- పలు అక్రమాలపై మళ్లీ డేగకన్ను



పోలీసులకు పట్టుబడిన కర్ణాటక మద్యం, నిందితుడు (ఫైల్)

పలమనేరు: జిల్లాలో చట్టవిరుద్ధమైన చర్యలకు పాల్పడుతున్న అక్రమార్కులపై స్పెషల్ బ్రాంచి అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. ఎస్పీ ఆదేశాలతో స్థానిక అక్రమాలపై నిఘా విభాగం దాడులు చేస్తోంది. దీంతో పాటు మరిన్ని అక్రమాలపై వారు ఇప్పటికే కీలక సమాచారాన్ని సేకరించినట్టు తెలిసింది. జిల్లాలో రేషన్ బియ్యం స్మగ్లింగ్‌కు సంబంధించిన బడా స్మగ్లర్ కిరణ్‌కుమార్ అక్రమాలపై వీరు ప్రత్యేక నిఘా పెట్టినట్టు సమాచారం. ఈ మధ్య వారం రోజుల్లోనే పలమనేరు సబ్‌డివిజన్‌లో రూ.3.5లక్షల విలువచేసే కర్ణాటక మద్యాన్ని పట్టణంలో పట్టుకున్నారు. ఇందులో కీలక నిందితుడైన పుంగనూరు రాజేష్‌పై కేసు నమోదు చేశారు. రెండ్రోజుల క్రితం పట్టణ సమీపాల్లోని అక్రమ టపాకాయల నిల్వ కేంద్రాలపై దాడులు చేసి సుమారు పది లక్షలు విలువచేసే టపాకాయలను సీజ్ చేశారు. తాజాగా ఆదివారం ఉమ్మడి జిల్లాలో రేషన్ స్మగ్లింగ్ డాన్ అరగొండ కిరణ్‌కుమార్‌కు చెందిన బియ్యం లారీని పలమనేరులో పట్టుకున్నారు. ఆపై తవణంపల్లె మండలంలోని కిరణ్‌కుమార్ అక్రమ గోడౌన్‌పై ఎస్పీ ఆదేశాలతో దాడులు చేపట్టి అక్కడ అక్రమంగా నిల్వ ఉంచిన బియ్యం, స్మగ్లింగ్‌కు చేసే బొలేరో వాహనాలను సీజ్ చేశారు. జిల్లాలో సాగుతున్న అక్రమాలపై ఎస్పీ ఆదేశాలతో స్పెషల్ బ్రాంచి కత్తికి పదును పెట్టి మరిన్ని అక్రమాలను రట్టు చేయడం ఖచ్చితంగా కనిపిస్తోంది. దీంతో పోలీస్‌శాఖలోనూ అక్రమాలను అరికట్టాలనే ప్రయత్నాలు మొదలైనట్టు తెలుస్తోంది.

చెకుముకి సైన్స్ సంబరాలు

తిరుపతి ఎడ్యుకేషన్ : జన విజ్ఞాన వేదిక(జేవీకే) ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా చెకుముకి సైన్స్ సంబరాలు–2024ను నిర్వహించనుందని జేవీకే నాయకులు రెడ్డప్ప, బిర్లానాయుడు తెలిపారు. తిరుపతిలోని యూటీఎఫ్ కార్యాలయంలో సోమవారం చెకుముకి సైన్స్ సంబరాల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాల స్థాయిలో 8, 9, 10వ తరగతి విద్యార్థులకు సైన్స్ టాలెంట్ టెస్ట్‌ను సెప్టెంబరు 25వ తేదీన, మండల స్థాయిలో అక్టోబరు 1న, జిల్లా స్థాయిలో అక్టోబరు 10వ తేదీన, రాష్ట్రస్థాయిలో నవంబరు 9, 10వ తేదీల్లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ పోటీలకు విద్యార్థులు పెద్దఎత్తున పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జేవీకే నాయకులు లక్ష్మీనారాయణ, యూటీఎఫ్ నాయకులు ముత్యాలరెడ్డి, నిర్మల పాల్గొన్నారు.

నేడు పెద్దశేష వాహన సేవ

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి ఆలయంలో అనుబంధంగా వెలసిన శ్రీకృష్ణుడు మంగళవారం రాత్రి పెద్దశేష వాహనంపై విహరించనున్నారు. సోమవారం శ్రీకృష్ణాష్టమి పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. స్వామివారికి అభిషేక సేవను నిర్వహించి అలంకరణ చేపట్టారు.

రుయాలో జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు

తిరుపతి తుడా: జాతీయ నేత్రదాన పక్షోత్సవాలను సోమవారం తిరుపతి రుయా ఆస్పత్రి కంటి విభాగం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రుయాలో అవగాహన కల్పించి, రోగులకు కంటి పరీక్షలు చేశారు. రుయా కంటి విభాగాధిపతి డాక్టర్ చలపతి రెడ్డి రోగులను ఉద్దేశించి మాట్లాడారు. నేత్రదానంపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఒక వ్యక్తి నేత్రదానం చేయడం ద్వారా ఇద్దరు అంధులకు కంటి చూపును ప్రసాదించవచ్చన్నారు. మరణానంతరం 8 గంటల వ్యవధిలోపు నేత్రాలను దానం చేయవచ్చన్నారు. నేత్రదానాన్ని కుటుంబ సంప్రదాయంగా మార్చుకోవాలని ఆయన హితవు పలికారు. కార్యక్రమంలో కంటి విభాగ వైద్యాధికారులు పాల్గొన్నారు.

వైభవంగా కృష్ణాష్టమి వేడుకలు

నగరి : మున్సిపల్, మండల పరిధిలో కృష్ణాష్టమి వేడుకలు సోమవారం వైభవంగా నిర్వహించారు. కృష్ణాలయాలు భక్తులతో కళకళలాడాయి. నివాసాల వద్ద మహిళలు కృష్ణాష్టమి ఉట్టి పడే రంగవల్లికలు వేయడంతో పాటు పిండివంటలు చేసి కృష్ణునికి పూజలు చేశారు. తడుకుపేట సత్యసాయి భజన మండలిలో నిర్వహించిన కృష్ణాష్టమి వేడుకల్లో శ్రీ సత్య సాయి సేవా ఆర్గనైజేషన్ జిల్లా అధ్యక్షులు మధుసూదన్ పాల్గొన్నారు. శ్రీకృష్ణాలయంలో గోపూజ, అష్టోత్తర పూజలు, భజన నిర్వహించారు. బాల వికాస్ విద్యార్థులతో కీర్తనలు పాడించారు. మహా మంగళహారతి అనంతరం సుమారు 500 మంది భక్తులకు అన్న ప్రసాదం వడ్డించారు. అనంతరం నిర్వహించిన సత్యసాయి భజన మండలి సమావేశంలో ఆయన మాట్లాడుతూ 'బాల వికాస్' లోక వికాస్‌గా మారాలంటే 6 ఏళ్ల నుంచి 14 వయసులోపు కలిగిన విద్యార్థులను బాల వికాస్ తరగతులకు విధిగా పంపాలని కోరారు. మొక్కలు నాటకంపై సభ్యులు శ్రద్ధ చూపాలన్నారు. అందరికీ మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా పదాధికారులు, యూత్ సాయిచేతన్, రమేష్, నవీన, తడుకుపేట కన్వీనర్, ఓ.వెంకటరమణ, సభ్యులు నాగేశ్వర్, నెహ్రూ బాబు, లవకుమార్, లీలారాం, బాల వికాస్ గురువు శ్రీదేవి, బాల వికాస్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకృష్ణుని జన్మదిన వేడుకలు

విజయపురం : మండలంలోని పాతర్కాడులో శ్రీకృష్ణుని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ప్రతి ఇంట్లో తల్లులందరూ తమ బిడ్డలను శ్రీకృష్ణుడి రూపంలో అలంకరించి వేడుకలు జరుపుకున్నారు. ఉట్టి కొట్టు పోటీలు నిర్వహించారు. యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. గ్రామస్తులు పెద్ద ఎత్తున తిలకించారు. పోటీలో గెలుపొందిన యువతకు బహుమతులు ప్రదానం చేశారు. రాత్రి స్వామి వారి ఊరేగింపు నిర్వహించారు.

ఘనంగా శ్రీకృష్ణ జయంతి వేడుకలు

వెదురుకుప్పం: చవటగుంట ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అలాగే మాంబేడు, బొమ్మన్‌దొడ్ల, పెరుమాళ్లపల్లెలో వేడుకలు ఘనంగా జరిగాయి.

కార్వేటినగరంలో..



కార్వేటినగరం: మాడవీధుల్లో విహరిస్తున్న వేణుగోపాలుడు

కార్వేటినగరం: స్థానిక టీటీడీ అనుబంధ వేణుగోపాలస్వామి ఆలయంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలుడు తిరుచ్చి వాహనంపై ఆశీనులై ఆలయ మాడవీధుల్లో విహరించారు. దీంతో భక్తులు కర్పూర హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. బొబ్బిలి వంశస్తులైన బొబ్బిలి రంగారావు దత్తపుత్రుడు బొబ్బిలి ప్రసాద్ వేణు గోపాల స్వామి సమీక్షంలో చేసిన నాట్యం భక్తులను ఎంతో ఆకట్టుకుంది. టీటీడీ డిప్యూటీ ఈఓ నాగరత్న, ఏఈఓ పార్థసారథి, సోమశేఖర్, ఆలయ అధికారి సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

శ్రీరంగరాజపురంలో..

శ్రీరంగరాజపురం: నెలవాయి గ్రామంలోని రుక్మిణీ సత్యభామ సమేత శ్రీకృష్ణ ఆలయంలో ఘనంగా నిర్వహించారు.

జీడీ నెల్లూరులో..

గంగాధర నెల్లూరు: మహాదేవ మంగళం పంచాయతీ సంతాన వేణుగోపాలస్వామి దేవస్థానంలో, మండల కేంద్రంలోని ఏగవూరులో, ఎల్లమరాజుపల్లిలో వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. సంతాన వేణుగోపాలస్వామి దేవస్థానంలో గోపూజ నిర్వహించారు. అనంతరం ఆలయంలో 1000 మందికి అన్నదానం చేశారు. మండలంలోని ఆలయల వద్ద చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషం వేసి మందిరం వద్ద ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.



విజయపురం: పాతర్కాడులో శ్రీ కృష్ణుని వేషధారణతో ఉట్టి కొడుతున్న చిన్నారి











శ్రీరంగరాజపురం: విశేష అలంకరణలో స్వామిఅమ్మవార్లు, జీడీనెల్లూరు: సంతాన వేణుగోపాలస్వామి, కార్వేటినగరం: నృత్యం చేస్తున్న ప్రసాద్, నగరి: మొక్కలు పంపిణీ చేస్తున్న శ్రీ సత్య సాయి సేవా ఆర్గనైజేషన్ ప్రతినిధులు, ప్రత్యేక అలంకరణలో శ్రీకృష్ణుడు